


# నలభై యోపడిలో

కాంతమ్మ కిప్పుడు నలభై యోపడి అయినా చూడ్డానికిమాత్రం అందంగానే కనుపడుతోంది. సదుపాయంవల్ల యీమధ్య కొంచెం లావెక్కినా, ఆ యెర్రని మేనిచాయ, తీర్చి దిద్దినట్లుండే ఆసూటైన ముక్కూ, ఆ కాటుకకళ్లూ, ఆ సన్నని పెదిమలూ, ఆ నల్లని కురులూ, ఆ మందగమనమూ—అన్నీ ఆమెకు నూతన సోయగాన్ని ప్రసాదిస్తూ, యువతీలోకాని చేరువగానే వుంచాయి. బాగా ముస్తాబయి, ఆమె బయటకు పోతూంటే చూచినవాళ్లెవరూ, ఆమె అయిదుగురు బిడ్డల తల్లి అనరు.

పెళ్లి అయి పద్దెనిమిది సంవత్సరాలు అయ్యింది. పెద్దబ్బాయి హైస్కూలులో నాలుగోఫారము యీయేడే ప్రవేశించాడు. రెండవవాడు అన్నను వెంబడిస్తున్నాడు తరువాత యిద్దరు ఆడబిడ్డలు. మళ్లా మొగబిడ్డ పుట్టిరెండేండ్లు అయింది. రామేశముగారి సంతాన నిరోధక బోధలు తలకెక్కడంచేత గాబోలు యిక బిడ్డల్ని కన్నంటుంది కాంతమ్మ.

కాంతమ్మ పెనిమిటి ప్రసాదరావు చాల ప్రశాంతమయినవాడు. ఏదో విధముగా నాలుగుడబ్బులు సంపాదించి, పెళ్ళాంబిడ్డల్ని సుఖపెట్టడం మాత్రమే ఆతని నిత్యకృత్యం. సరదా లెరుగడు. సరసాలంతకన్నా యెరుగడు. ప్రొద్దున్నేపోతాడు బయటికి, మళ్ళా సాయంత్రంకాని రాడు. దినమంతా దుక్కిలో నలిగిపోయిన యెద్దుకుమల్లె, అలసి సొలసి, సాయంత్రాని కతడు యింటికిచేరుకొని, కాంతమ్మచేసే సపర్యలకు సంతోషించి, బిడ్డల ఆటలసందడికి ఆనందించి, గాలివాటునవున్న పడకకుర్చీలో మేనువాల్చి, అట్లానే మాగన్ను నిద్రలో మహదానందం అనుభవించేవాడు.

శ్రీ బయ్యా సూర్యనారాయణమూర్తి. ఎం. ఎల్. ఏ.

భార్య అంటే ఆతని కమితప్రేమ. ఆమె హితబోధలం దతనికి విశ్వాసము మెండు. ఎన్నడూ ఆమె ఆజ్ఞ జవదాటి యెరుగడు. అప్పుడప్పుడూ, స్నేహితులతో, భగవంతుడు తనకిచ్చిన వరాలన్నింటిలోనూ, మొట్టమొదటిది, తన పెండ్లామేనని, మురిసిపోతుంటాడు ప్రసాదు.

కాంతమ్మ మితభాషిణి. అయినా చతురతకూ, ఛలోక్తులకూ, యెవ్వరికి తీసిపోదు. ఆమె మాట లొక్కొక్కప్పుడు అనుమానానికి తావిచ్చినా, ఆమె కడచిన జీవితాన్ని యెరిగినవారు యిదంతా వట్టి నోటి దుత్తరే అంటారు. అదికూడా కొంతనిజమే అనొచ్చు. ఏమో, పెళ్ళికి ముందు కొంత అపనిందపొందినా, వివాహానంతరం మాత్రం ఒకరిచేత వ్రేలుపెట్టి చూపించుకోకుండా, సంసారం దిద్దుకొంటూ, మంచిగా కాలంవెళ్లబుస్తుందా యిల్లాలు.

కాలం ఎప్పుడూ వొకేలా గుంటుందీ?

* *

అతనిది తెనాలిదగ్గిర ఒక కుగ్రామమంట. తండ్రి పోయాడనీ, తల్లి తప్ప తనకు ప్రపంచంలో నా అనేవారెవ్వరూ లేరనీ, మంచి సాంప్రదాయంగల కుటుంబం వాణ్ణనీ చెప్పి, యింట్లో ప్రవేశించా డతడు. మొదట కాంతమ్మ, ప్రసాదరావులు అతడికి యింట్లో చోటివ్వడానికి వొప్పుకోలేదు. కాని అతడి మాటలు, వైఖరీ, చూచి, చాల మంచి పిల్లవాడనీ, తమ పిల్లలతో పాటు వుంటాడనీ తలంచి సరే అన్నారు. మోహనరావుకూడా మూర్తీభవించిన వినయ విధేయతో అన్నట్లు కాంతమ్మను అమ్మా అనీ, ప్రసాదరావుని నాయనా అనీ వరుసపెట్టి పిలుస్తూ, వాళ్ల బిడ్డల్ని ముద్దుగా చూచుకొంటూ, తలలోనాలుకై మెలిగేవాడు.

తండ్రి లేకపోయినా, పిత్రా మయిన పొలం పదిహేనుపుట్లు మాంచి వొకట రకమైంది వుందనీ, రొక్కం పాతికవేలు బ్యాంకిలోవుందనీ, తల్లి మెళ్ళో వస్తువులతో ఒకతరం వెళ్ళుతుందనీ, చాల నెమ్మదిగా, అందరకూ నచ్చేటట్లు చెప్పేవాడు మోహనరావు. ఏకైక సంతాన మవడంచేత, తల్లికి తానంటే అమిత గారాబమనీ, అందుచేతనే తనకు చదువబ్బింది కాదనీ, ఈరోజుల్లో విద్యలేకుంటే నామోషీఅనీ, కాదూ కూడదంటున్నా తల్లికి నచచెప్పి, మోహనరావు వెనుక దారిని విద్యాధికుల లిస్టులో చేరదామని, కేంబ్రిడ్జ సీనియరు చదవడానికే పట్టణంవచ్చాడు. ఈ పరీక్ష ప్యాసయి, సీమకెళ్ళి, ఏ. ఐ. సి. యస్‌కో, ఏ బారిష్టరుకో చదివి, పేరు ప్రఖ్యాతులు గడించి, ముసలి తల్లికి మోదం చేకూర్చడమే తన జీవిత పరమావధి అని చెప్పేవాడు. పట్టణంలో పేరుమోసిన సిటీ కాలేజిలో చేరాడు. పుస్తకాలన్నీ కొన్నాడు. చదువు మొదలు పెట్టేడు. కాని, చదవాలనీ, పెద్దపెద్ద డిగ్రీలు పొందాలనీ ఆశతప్ప, శక్తి సున్న. పైడాబేగాని, లోపలంతా గుల్లయే. అందంగా అలంకరించుకోవడం, ప్రొద్దున్నా, మధ్యాహ్నం పుస్తకాల కట్టలు కట్టుకొని బయలుదేరడం మాత్రం సక్రమంగా జరుగుతోంది.

ప్రసాద రావుకు వ్రాతకోతలకూ, పిల్లలకు చదువు చెప్పడానికీ, మోహనరావు వెనుతీసే వాడు కాడు. వాళ్లు కోరక ముందే, అప్యాయంగా వెళ్ళి, వాళ్లకు తోడుపడే వాడు. అంతా తన దన్నట్లు సంచరించే వాడు. అరమరికన్నా మా టికోశంలోనూ కనపడదేమో!

* * *

పనిమీద ప్రసాదరావు వూరెళ్లాడు. మరునాడు నుంచే మోహనరావు చూపుల్లో కొంత మార్పు కనిపించింది. ఈ మార్పుకు కాంతమ్మ కూడా కారణమేమో. వింత వింతగా చూచుకోవడం, అదో రకంగా

ముసిముసి నవ్వులు నవ్వడంతో ప్రారంభించిందివారి కథ. పని లేకపోయినా పదిసార్లు యింట్లో అటూ ఇటూ తిరగడం, తిరుగుతూ వొకళ్ల నొకళ్లు రాసుకోవడం, రాసుకొని చతురోక్తుల్లోకి దిగడం, అటు తర్వాత సరసాల్లోకి, తదనంతరం...అంతా గ్రంథ సమాప్తం అయింది.

ఉదయం సాయంత్రం షికార్లకు పోవడం, మంచి మంచి పిండివంటలు చేసి సుష్టుగా భోంచేయడం, "సతీపతుల కుతూహాల రహస్యం" లాంటి పారాయణం, సరస సల్లాపాలతో కాలం హాయిగా గడవడం లోకి దిగింది కాంతమ్మ మోహన రావుల జీవితం.

ఒకర్నొకరు చూచుకోకుండా అరనిమిషం ఉండలేక పోయేవారు. ఎదిగిన పిల్లలు వున్నారని కాని, ప్రక్కవాళ్లు యేమనుకుంటారో అని గాని భయమే లేకుండా సంచరిస్తూండే వాళ్లు.

రాత్రి పదిదాటింది. పిల్ల లందరూ దగ్గరలోనే పరుపులమీద పడుకున్నారు. పెద్దవాడికి నిద్ర పట్ట లేనట్టుయింది. ఇటూ అటూ నుసులు కొంటున్నాడు. దీపము బాగా వెలుగుతోంది. తెరిచి వుంచిన కిటికేల్లోంచి చల్లగాలి హాయిగా వీస్తోంది. ఆ వెల్తుర్లో, పౌడరురాసిడ కాంతమ్మమొగం నూత్న సోయగంతో కలకల లాడుతుంది. వాసననూనెరాసి, చక్కగాదువ్వి, కొండెచుట్టి, పూలు చక్కగా తురుముకొని, వొదులుగానున్న చుక్కల సిల్కు బ్లవుస్ తొడుక్కొని, రోజాపూల సిల్కుచీర కట్టుకొని, గోటుగా తయ్యారయ్యిన కాంతమ్మనుచూస్తే, సినీ మాతారలు కూడా సిగ్గుపడతారు. ఎత్తయిన మంచమూ, మంచానికి ఈడయిన పరుపు, పరుపుమీద చక్కటిదుప్పటి, దానిమీద మల్లెపూలూ చల్లివున్నాయి. లేసువేసి కుట్టిన తలగడలు రెండువైపులా వున్నై. మోహన రావు పండుకొనివున్నాడు. కాంతమ్మ అతనిచెంత మోహాకలాపంలో మునిగిపోయింది.

"సుదర్శనం ఇంకా నిద్రపోలేదను కుంటాను" అన్నాడు మోహనరావు ఆమె మెళ్ళోవున్న గొలుసూ, పేరూ, తాడు, వేరుచేసి, కంఠదగ్గర యేర్పడ్డగుంటను వ్రేలితో నిమురుతూ.

కాం—"ఏమీ, భయంవేస్తుందా?" చమత్కారంగా.

మో॥ "భయమెందుకు? ఏదీ వొకముద్దు. అబ్బా! ఏమి యీతీపి." ఎల్లముద్దుల రుచులనే నెరిగినాడ" అన్నాడా దౌర్భాగ్యపునలుడు వాడికీ రుచి ఇలా తెలిసుంటే ఆలా ఏడుస్తాడూ?

కాంతమ్మ చిరునవ్వుతో: "విమర్శనలోకి దిగావే నేడు" అంటూ ఎడమచేతి వ్రేలితో మోహానుని క్రింది పెదవి మీటడం ప్రారంభించింది.

మో॥ దినానికొక నూతనానందం పొందాలి.

కాంతమ్మకళ్ళు ముద్దుపెట్టుకొని "ఆయన వచ్చాక నన్ను మర్చిపోతావు కాబోలు" అన్నాడు కొంచెం దైన్యంగా.

కాం॥ నేనా? నిన్ను మర్చిపోవడమా? నీకు నోరెట్లా వస్తుంది? ఇంతకూ మగాళ్ళు మహామాయావులు." అని అతణ్ని ముద్దుపెట్టుకొని, క్రింది పెదవి కొరికింది.

మోహనుడు ఆమెను గట్టిగా కవుగలించుకొని, ఆమె ముఖచంద్రుణ్ణి ముద్దులతో మొత్తాడు. ఆతని పట్టు విడిపించుకోవడానికి కాంతమ్మ ప్రయత్నించింది. కొంచెం స్థూలం అవడంవల్ల అంతలోనే అలసిపోయి ఆతనిమీద వొరిగింది. పెనుగులాటలో పమిట జారింది. కొండె వూడింది. అప్పట్లో కాంతమ్మ రూపొందిన... దేవిలా తయారయ్యింది.

* * *

ప్రసాదరావు తిరిగి వొచ్చాడు. మరునాడే అనుమానం తగిలింది. కనిపెట్టాడు. దొంగలు దొరికారు. అల్లరి చేస్తే బట్టబయలవుతుందని, రహస్యంగా కాంతమ్మను గద్దించాడు. చంపేస్తానని బెదిరించాడు. పిల్లల మొగమయినా చూడమని బ్రతిమాలాడు. కాని లాభం లేకపోయింది. తన స్వేచ్ఛకు అడ్డం వస్తే, మోహనరావుతో లేచిపోతానంది. శక్తివుంటే నరుక్కోమంది. అవస్థపెడితే, విషం పెట్టి, అందర్నీ చంపుతానంది. పాపం ప్రసాదరావేమి చేస్తాడు? పోయే కాలం గాని వచ్చేకాలం గాదు. ఇప్పుడు గోల చేసినా, పెళ్లాని వదిలిపెట్టినా తనకే చిక్కనుకొన్నాడు. ఇల్లాంటివి యెన్ని లేవేంటనుకున్నాడు. తనలో తాను సమాధానం పడ్డాడు. కాంతమ్మతో రాజీ చేసుకున్నాడు. మోహన రావుకు సర్వాధికారం యిచ్చాడు. ఈ సంగతి బిడ్డలందరకూ తెలుసు. ఊరూ వాకడ అంతా యెరుగుదురు. కాని ఎరగని వారిలాగు అందరూ నటన ప్రారంభించారు. కందకు లేని దురద బచ్చలి కెందు కనుకున్నారు కాబోలు!

* * *

కాంతమ్మ కంగారు పడుతూ "ఏమండీ! ఇందులో నా చైనూ, వస్తువులూ తీసారా" అంది.

ప్రసాదరావు కాగితాలు తీరుబడిగా తిరగవేస్తూ, ఎక్కడవేశా వేమిటి?" అన్నాడు కొంచెం మందంగా.

"ఇదులో, ఈ చెస్ట్రడ్రాలో"

"నే నెందుకు తీస్తాను?"

"డబ్బు కూడా లేదే? అమ్మయ్యో! బట్టలూనూ. సర్వనాశనం. సర్వనాశనం" పిల్లలందరు చేరుకున్నారు. తల్లివంక ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డారు.

"తొందరపడక వొక్కొక్క సొరుగే తీసి చూడు. ఆదమరుపున పెట్టిలోగాని పెట్టావేమో."

పిచ్చిదానివలె గదిలో చిందులు తొక్కుతూ, రొమ్ము బాదుకొంటూ "ఇంకెక్కడిది? అమ్మయ్యో, అమ్మయ్యో" అని ఏడ్పు ప్రారంభించింది కాంతమ్మ.

"దొంగలెవరు వస్తారు? పైగా రాత్రి ఆ గదిలోకి నేనడుగ్గైనా పెట్టలేదే?" అన్నాడు ప్రసాదరావు ఆలోచిస్తూ.

"ఆయన వచ్చాడుగదుటే రాత్రి. ఆయన తీసాడేమో అడుగు" అంది పెద్దపిల్ల పుష్పం.

తండ్రి మొగంలో నెత్తురు చుక్కైనా లేదు.

* * *

మధురలో దొరికాడు మోహనరావు. అతడు చాల పేదవాడనీ, స్కూలులోవుండగానే దొంగతనాలు చేస్తుంటే, డిస్మిసు చేసారనీ, ఇంకో నేరానికి ఏ స్కూల్లోనూ చేరకూడదని విద్యాశాఖవారి తాకీదులంపారనీ, తరువాత పెద్ద మోసాలకు ప్రారంభించాడనీ, అప్పుడప్పుడూ కొద్ది కొద్ది శిక్షలు అనుభవించాడనీ, కాంతమ్మకేసే పెద్దమెట్టు అనీ, ఇంకా, ఇంకా యేవేవో పోలీసువారు విచారించి తెలుసుకున్నారు. కాంతమ్మ కథంతా కోర్టులోకికూడా ప్రాకింది"

ఇపుడు కాంతమ్మను అందరూ అనేవారే. మగడికి, బిడ్డలకుకూడ రోతయ్యింది పాపం. బయట మొగమే పెట్టడంలేదు. మనోవ్యాధితో మంచమెక్కిందనికూడా పుకారు పుట్టింది.

కాని పోయిన సొత్తువస్తుందా?

ఇంతకూ కాంతమ్మ విచారానికీ, మనోవ్యాధికీ కారణమేమిటో?